క్లుప్తంగా

హుండీ లెక్కింపు



రామారెడ్డి (ఎల్లారెడ్డి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీ కాలభైరవుడి ఆలయ హుండీ లెక్కింపు గురువారం చేపట్టారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఆలయ ఈవో ప్రభు గుప్తా పర్యవేక్షణలో హుండీని తెరిచి లెక్కించారు. రూ.3,76,412 ఆదాయం వచ్చినట్లుగా ఆలయ ఈవో ప్రభు గుప్తా తెలిపారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ వంశీకృష్ణ శర్మ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. బుధవారం నాటికి 99 వేల 270 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారం ఉపసర్పంచ్ ధర్మవీర్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి గురువారం నాగిరెడ్డిపేట ఎస్సై రాజు అప్పగించారు. ధర్మవీర్ తన సెల్‌ఫోన్‌ను ఈ నెల 19న మండలకేంద్రం గోపాల్‌పేటలో పోగొట్టుకున్నాడు. ఈ విషయమై నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో..ఫోన్ జాడ కనిపెట్టారు.

మరో వ్యక్తి సెల్‌ఫోన్..

ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి): పోసన్‌పల్లి గ్రామానికి చెందిన పోతుగుంట శంకర్‌కు పోలీసులు గురువారం ఫోను అందజేశారు. కొద్ది రోజుల క్రితం శంకర్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఫోన్‌ను ఆన్‌లైన్ ద్వారా గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు

బాధ్యతల స్వీకరణ



బీబీపేట: బీబీపేట మండల నూతన ఎస్సైగా అనిల్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పని చేసిన ఎస్సై సాయిరెడ్డి బదిలీపై వెళ్లగా.. కామారెడ్డిలో ఎస్సైగా పని చేసిన అనిల్ బీబీపేటకు బదిలీపై వచ్చారు. శాంతిభద్రతలను కాపాడడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డి రూరల్ (ఎల్లారెడ్డి): సోమార్‌పేట్ గ్రామానికి చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్ ప్రసాద్ మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది గురువారం ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్ కుటుంబానికి ఎంపీడీవో లక్ష్మి, ఎంపీవో ప్రకాష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు

పెళ్లింట విషాదం..

బాన్సువాడ రూరల్: పెళ్లి ఇంట విషాదం చోటుచేసుకున్న ఘటన బాన్సువాడ మండలం బోర్లంక్యాంపులో చోటుచేసుకుంది. షేక్ రజాక్‌మియా కూమార్తె సనా రిజ్వానా పెళ్లి గురువారం ఉదయం జరిగింది. షేక్ రజాక్ మియా అక్క గౌసియా మధ్యాహ్నం మృతి చెందింది. దీంతో పెళ్లికి వచ్చిన వారు రాత్రి చావుకు హాజరు కావాల్సి వచ్చింది. గౌసియా భర్త ఉస్మాన్ కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యకర్త కావడంతో విషయం తెలుసుకున్న టీపీసీసీ సభ్యులు కాసుల బాలరాజు పరామర్శించి నగదు సాయం అందించారు. నాయకులు ఖాలెక్, షాహబ్, మంత్రి గణేష్, మహిబూబ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్ ప్రారంభం



దోమకొండ: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో గురువారం బోరుమోటార్‌ను బిగించగా, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ ప్రారంభించారు. జిల్లా పరిషత్ నిధులతో బస్టాండ్‌లో నీటి ఎద్దడిని తీర్చడానికి బోరుమోటార్‌ను బిగించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లవు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లవు శ్రీనివాస్, వార్డు సభ్యులు ఐరేని రాజేందర్ ఉన్నారు.

పనులు ఆగవు.. సాగవు

- నత్తనడకన సమీకృత మార్కెట్ల పనులు
- ప్రభుత్వం మారడంతో పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్
- పర్యవేక్షణలో అధికారుల నిర్లక్ష్యం



అసంపూర్తిగా బాన్సువాడ సమీకృత మార్కెట్

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్ల పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పనులు ఆగవు.. ముందుకు సాగవు అన్నట్లు నడుస్తున్నాయి. గత ప్రభుత్వం ప్రతిపాదించిన సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు నత్తే నయం అన్నట్లు సాగుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి రెండేళ్లు గడిచింది. ఏడాదిన్నర క్రితం పనులు మొదలు పెట్టారు. నిర్ణీత గడువు ఏడాది..అయితే గడువు ముగిసి ఆర్నెళ్లు గడిచినా అభివృద్ధి పనులు స్లాబ్‌లకే పరిమితమయ్యాయి.

చొరవ కరువు..

ప్రస్తుతం బాన్సువాడలో వ్యాపారులు రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. వ్యాపారుల ఇబ్బందులు గుర్తించిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి సమీకృత మార్కెట్ నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజురు చేశారు. పాత అంగడి బజారులో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల సముదాయాల నిర్మాణానికి గత ఏడాది ఫిబ్రవరిలో శంకుస్థాపన చేశారు. ఏడాదిన్నర క్రితం నుంచి పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిర్మాణ పనులు ఆగవు.. సాగవు అనేలా చేస్తున్నారు. కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం, చేపలు అన్నీ ఒకే చోట లభించేలా ఈ మార్కెట్లకు డిజైన్ చేశారు. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం స్లాబ్ లెవల్‌లో నిర్మాణాలు నిలిచిపోయాయి. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిందని, పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని తెలిసింది. ఉన్నతాధికారులు, ఇంజినీర్లు ఒత్తిడి తేలేకపోతున్నారు. ఈ పనులు ఇప్పటికిప్పుడు చేపట్టినా పూర్తయ్యేసరికి మరో ఆరు నెలలు పట్టేలా ఉంది.

'అసెంబ్లీలో ప్రజల సమస్యలు ప్రస్తావించారు'



లింగంపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న నాయకులు

లింగంపేట/నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అసెంబ్లీలో మొదటి సారిగా నియోజక వర్గ సమస్యలపై ప్రస్తావించి అందరి దృష్టిని ఆకట్టుకున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం లింగంపేట, నాగిరెడ్డిపేట మండల కేంద్రాల్లో వారు మాట్లాడారు. గత పాలకులు పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ అవినీతిపై అసెంబ్లీలో ప్రతిపక్షాలను ఎమ్మెల్యే నిలదీశారని చెప్పారు. సమస్యలపై నిలదీసే ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైద్రాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిశారు. సొసైటీ పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమకు సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు.

ఏబీవీపీ బాన్సువాడ నగర కార్యవర్గం ఎన్నిక



బాన్సువాడ: ఏబీవీపీ బాన్సువాడ నగర కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కామారెడ్డి జిల్లా కన్వీనర్ కృష్ణ తెలిపారు. నగర కార్యదర్శిగా హనుతేజ్, సంయుక్త కార్యదర్శిగా భానుప్రకాష్, వివేకానంద జోనల్ ఇన్‌చార్జిగా బస్వంత్, అంబేడ్కర్ జోనల్ ఇన్‌చార్జిగా ఆనంద్‌లను నియమించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థి ఉద్యమాలు, విద్యారంగ సమస్యలపై పోరాటం చేయడంలో ఏబీవీపీ కీలకపాత్ర పోషిస్తుందని కృష్ణ అన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల ఎన్నిక



నిజాంసాగర్(జుక్కల్): పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయిలో కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించింది. పార్లమెంట్ ఎన్నికలతో పాటు పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గ్రామ కమిటీలను ఎన్నుకుంటున్నారు. గురువారం మంగ్లూర్, బంజపల్లి, సుల్తాన్ నగర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు పార్టీ మండల నాయకులు ప్రదీప్, ఎలే. మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగ్లూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సాయిలు, బంజపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అనీస్ మోహినోద్దిన్, సుల్తాన్‌నగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుర్మ సాయిలును ఎన్నుకున్నారు.

కానిస్టేబుల్ కిష్టయ్య తల్లికి అంతిమ వీడ్కోలు



లష్మవ్వ (ఫైల్)

రాజంపేట: తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన కానిస్టేబుల్ కిష్టయ్య మాతృమూర్తి పుట్టకొక్కుల లస్మవ్వ(89) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. కానిస్టేబుల్ కిష్టయ్య స్వగ్రామమైన రాజంపేట మండలం శివాయిపల్లిలో గురువారం సాయంత్రం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆమె మరణవార్త తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ముదిరాజ్ సంఘ నాయకులు పున్న రాజేశ్వర్ శివాయిపల్లి చేరుకుని సంతాపం తెలిపారు. గ్రామ పాలక వర్గంతో పాటు ఉమ్మ జిల్లా అమరు వీరుల కుటుంబాల సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

సమయపాలన పాటించని కార్యదర్శులు



మధ్యాహ్నమే మూసి ఉన్న తలాబ్ తండా జీపీ కార్యాలయం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పంచాయతీ కార్యదర్శులు సకాలంలో విధులకు హాజరు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని తలాబ్ తండా, పోచారం, పోచారం తండా తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మధ్యాహ్నం 1.30 గంటలకే తాళం వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎదైనా పని ఉందని అడిగితే ఉదయం రమ్మని చెబుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఎప్పుడు విధులకు వస్తారో.. ఎప్పుడు పోతారో తెలియడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ పౌల్ట్రీ స్టేషన్‌లో పెరటి కోళ్లపై అవగాహన కల్పించినట్లు ఈసీ డాక్టర్ రవీందర్ రెడ్డి తెలిపారు. గురువారం లింగంపేట మండలంతో పాటు భిక్కనూరు, పెద్దకొడప్‌గల్, పిట్లం, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన పలువురికి పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. పెరటి కోళ్ల పెంపకందారులు సమయానికి వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని, కోళ్లలో వచ్చే వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్ అన్నారు గురువారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలోని ఎర్రమన్నకుచ్చ కాలనీలో కాలనీవాసులకు అవగాహన సదస్సు నిర్వహించారు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని, మత్తు పదార్థాలను రవాణా చేయవద్దని సూచించారు. ఎస్సై గణేష్, కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఏఎస్సై అబీద్ బేగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. పలువురికి జరిమానాలు విధించారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి: మండల కేంద్రంలో కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై గురువారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలానాలు చెల్లించని వారిని పట్టుకుని కట్టించారు.

రేపు శ్రీమద్భగవద్గీత శ్లోక పఠన పోటీలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లి శ్రీ కృష్ణ మందిరంలో గీతా జయంతిని పురస్కరించుకొని శనివారం శ్రీమద్భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతులు మచాలే బాబా, కన్హై రాజ్ బాబాలు తెలిపారు. ఈ పోటీల్లో 6-10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులను తీసుకుంటున్నట్లు వెల్లడించారు.



శనగ పంటను పరిశీలిస్తున్న ఏవో రాజు



నాగ్లూర్‌లో పరిశీలిస్తున్న ఏవో నరేష్

యాసంగి పంటల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): మద్నూర్, డోంగ్లి మండలాల్లోని కుర్లా, పెద్ద శక్కర్గ గ్రామ శివారుల్లో యాసంగి సాగు చేస్తున్న పంటలను గురువారం వ్యవసాయ శాఖ అధికారి రాజు పరిశీలించారు. వరి పంటలతో పాటు శనగ పంటకు ఆశిస్తున్న తెగుళ్లు, వాటి నివారణకు పిచికారీ చేయాల్సిన రసాయన మందులను రైతులకు వివరించారు. వరి నారుమడుల్లో సాయంత్రం వేళ నీళ్లు తీసేసి పగటి వేళ నీరు పెట్టాలన్నారు. జింకు ధాతు లోపం వల్ల ఆకులపై తుప్పుమచ్చలు ఏర్పడతాయని చెప్పారు. 2 గ్రాముల జింక్ సల్ఫేట్, లీటర్ నీటిలో కలిపి నారు మడిపైన పిచికారీ చేయాలన్నారు. శనగ పంటలో ఎండు తెగులు, పచ్చ పురుగు గమనించామని.. నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ మూడు గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు.

గాంధారి(ఎల్లారెడ్డి): నేరల్, నాగ్లూర్ శివారులో మొక్కజొన్న, శనగ పంటలను ఏవో నరేష్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు

బాన్సువాడ రూరల్: దివ్యాంగ విద్యార్థులకు ప్రతి రోజు ఫిజియోథెరపి చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ భవిత కేంద్రం ఫిజియోథెరపిస్టు గంగాధర్ అన్నారు. గురువారం భవిత కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఫిజియోథెరపి చేశారు. వికలాంగలైన విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు చేదోడు వాదోడుగా ఉండాలన్నారు. వారి వైకల్యాన్ని అవహేళన చేయకుండా ఆదరించాలన్నారు.

ఆయన వెంట ఐఈఆర్‌పీఎస్ వెంకట పద్మ, వసంత్‌కుమార్ ఉన్నారు.

కబ్జా భూమిని స్వాధీనం చేసుకోవాలి

రాజంపేట: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సర్వే నెంబరు 638/ఏ గల 4 గుంటల మిగులు భూమిని స్వాధీనం చేసుకోవాలని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, బీజేపీ గ్రామ అధ్యక్షుడు గుర్రాల రాము, సొసైటీ డైరెక్టర్ వజాహత్ అలీ, మాజీ డైరెక్టర్ బాలాజీలు గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి ఓ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి ఈ మిగులు భూమిని కబ్జా చేసి, కంచె ఏర్పాటు చేసినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామ సభ



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం సవర్‌గావ్‌లో గురువారం గ్రామ సర్పంచ్ కిషన్ పవార్ ఆధ్వర్యంలో ఈజీఎస్ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలోని కూలీలకు ఉపాధి కల్పనతో పాటు గ్రామానికి ఉపయోగపడే ఉపాధి పనులను గుర్తించారు. ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, పంచాయతీ కార్యదర్శి రమేష్, తదితరులున్నారు.

రోడ్ల అభ్యున్నతికి సహకరించాలి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): మారుమూల గ్రామాల రోడ్లకు నిధులు మంజూరు చేస్తూ అభ్యున్నతికి సహకరించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును కోరారు. గిరిజన తండాలతో పాటు గ్రామాల మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు నిధులు కేటాయించాలన్నారు. ప్రతి గ్రామానికి, గిరిజన తండాకు బీటీ రోడ్డు వేయించి రవాణా సదుపాయం కల్పిస్తామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి

రాజంపేట: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఐకేపీ డీపీఎం రమేశ్ బాబు అన్నారు. గురువారం రాజంపేట మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘం కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ లింకేజ్ టార్గెట్ వంద శాతం జనవరి 10, 2024 వరకు పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా ఎన్‌పీఏ లేకుండా చూ డాలని కోరారు. రాజంపేట మండలం ఆదర్శ మండలంగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. మండల సమాఖ్య కార్యదర్శి లావణ్య, ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివాస్, సాయిలు బాగయ్య, స్వామి, అకౌంటెంట్ ప్రశాంతి పాల్గొన్నారు.

పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించాలి

- జెడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి



రికార్డులను తనిఖీ చేస్తున్న జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని గురువారం జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి సూచించారు. ఇసన్నపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విద్యార్థులకు శత్రుముఖ ప్రక్రియలతో పాటు, చదవడం రాయడం తప్పకుండా వచ్చేలా బోధన చేయాలని సూచించారు. పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలకిషన్, పోసానిపేట సర్పంచ్ మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాలువను కబ్జా చేశారు

- వెంచర్ల పేరుతో కాల్వలను నాశనం చేశారు
- బీబీపేట గ్రామసభలో ప్రజాప్రతినిధులను నిలదీసిన ప్రజలు



బీబీపేటలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

బీబీపేట: వెంచర్ల పేరుతో చెరువుల కాలువలను సైతం కబ్జా చేసి సొమ్ము చేసుకుంటున్నారని, వెంచర్ల బారి నుంచి కాలువలను పునరుద్ధరించాలని బీబీపేటలో నిర్వహించిన గ్రామ సభలో ప్రజలు పట్టుబట్టారు. గురువారం బీబీపేటలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా యాడారం రోడ్డులో వెలసిన అయ్యప్ప వెంచర్ వాళ్లు కొంచెరువు నుంచి దిగువకు నీళ్లు వదలాల్సిన కాలువను పూడ్చి వేసి కబ్జా చేశారని, గతంలో సైతం రైతులు విన్నవించినా సమస్య పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువను పూడ్చి వేసి ప్లాట్లు చేశారని వెంటనే దానిని ఆపాలని తెలిపారు. అలాగే బీబీపేట పెద్ద చెరువు కింద ఉన్న 1800 ఎకరాలకు సాగు నీరు అందుబాటులో ఉందని, 1400 ఎకరాలకు నీళ్లు వదలడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. గ్రామసభలో ఉపసర్పంచ్ సాయినాథ్, కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితేనే విజయం వరిస్తుంది



పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న ఎంఈవో

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పదవ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయం తప్పకుండా వరిస్తుందని ఎంఈవో యోసెఫ్ సూచించారు. గురువారం పద్మాజీవాడి ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో మహతి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. టెన్త్ ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బడి మధ్యలో మానిన పిల్లల గుర్తింపు



ఎక్కపల్లి శివారులో బడి మధ్యలో మానేసిన పిల్లలతో సీఆర్పీలు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎక్కపల్లి, కొయ్యగుండు తండా, కొట్టాల్‌గడ్డ తండా గ్రామాల్లో గురువారం సీఆర్పీలు బడి మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బడి మధ్యలో చిన్నారులను మాన్పించకూడదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చదువుకునే సమయంలో పిల్లలతో పనులు చేయించవద్దన్నారు. సీఆర్పీలు సంగాగౌడ్, సంజీవ్, విజయ్‌కుమార్, రాజు, సత్యనారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత దంత పరీక్షల శిబిరం నిర్వహించారు. దంతాల పరిశుభ్రత గురించి విద్యార్థులకు వివరించారు. మనిషి దంతాలే వారి ఆరోగ్యాన్ని చెబుతాయని వాసవీ డెంటల్ కేర్ ఆస్పత్రి వైద్యులు రాకేష్, నవ్యలు అన్నారు. దాదాపు 200 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. రోటరీ కామారెడ్డి శాఖ అధ్యక్షుడు పి.సత్యం, కార్యదర్శి పి.రాజనర్సింహరెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.